# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 07 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోలు మృతి

**బలగం టీవి, బీజాపూర్**

ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా తార్లగూడెం పరిధిలో గురువారం ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం–మరికెళ్ల అడవుల్లో ఈ ఘటన చోటు చేసుకుంది. మద్దేడు ఏరియా కమిటీకి చెందిన మావోయిస్టులు అక్కడ తలదాచుకున్నారన్న సమాచారంతో భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు కాల్పులు ప్రారంభించడంతో ప్రతిగా పోలీసులు బుల్లెట్లు విసిరారు. సుదీర్ఘ కాల్పుల అనంతరం నలుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు.

మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఆపరేషన్ కగార్'లో భాగంగా ఈ చర్య చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గత నెలలో జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందగా, తాజా సంఘటనతో మృతుల సంఖ్య ఏడుకి చేరింది. భద్రతా బలగాలు మరికెళ్ల అడవుల్లో మావోయిస్టుల శిబిరాలను గుర్తించి ధ్వంసం చేశాయి. మావో లాజిస్టికల్ సరఫరా మార్గాలపై కూడా పోలీసులు దృష్టి సారించారు. స్థానిక గ్రామాల్లో కట్టుదిట్టమైన తనిఖీలు కొనసాగుతున్నాయి.

# ఉపఎన్నికలో కాంగ్రెస్ విజయం ఖాయం

- ఫేక్ సర్వేలను తిప్పికొట్టాలి
- సీఎం రేవంత్ రెడ్డి
- మంత్రులు, కీలక నాయకులతో సమీక్ష
- పోలింగ్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తి ధీమా వ్యక్తం చేశారు. బైపోల్ సమయం దగ్గరపడుతున్న వేళ, ప్రచార వేగాన్ని మరింత పెంచేందుకు ఆయన మంత్రులు, కీలక నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. "నియోజకవర్గంలో కాంగ్రెస్ పట్ల సానుకూల వాతావరణం నెలకొంది. గెలుపు మన సొంతం," అని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేసినట్లు సమాచారం. ఎన్నికల ప్రచారం ముగియడానికి మిగిలిన మూడు రోజుల్లో పార్టీ శక్తిని పూర్తిగా వినియోగించుకోవాలని, ప్రతి డివిజన్ స్థాయిలో సమన్వయం బలపర్చాలని ఆయన మంత్రులకు దిశానిర్దేశం చేశారు. "వార్డులు, బూత్‌ల స్థాయిలో సమిష్టి కృషి జరిగితే కాంగ్రెస్ అభ్యర్థి ఘన విజయం సాధిస్తాడు," అని సీఎం ఉత్సాహపరిచినట్లు తెలిసింది.

బీఆర్ఎస్ పార్టీ ప్రతిరోజూ సోషల్ మీడియాలో తప్పుడు సర్వేలు విడుదల చేసి ఓటర్లను గందరగోళానికి గురి చేస్తోందని సీఎం మండిపడ్డారు. ఈ "ఫేక్ ప్రొపగాండా"ను సమర్థవంతంగా



ఎదుర్కొనేందుకు ప్రత్యేక మీడియా వ్యూహం సిద్ధం చేయాలని ఆయన సూచించారు. "ప్రజల్లోకి వాస్తవాలను తీసుకెళ్లాలి. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం చేయాలి," అని ఆదేశించారు. కాంగ్రెస్ నేతలు సోషల్ మీడియాలో బలమైన కౌంటర్ ఇవ్వాలని, తప్పుడు ప్రచారాన్ని వెంటనే తిప్పికొట్టాలని ఆయన ఆదేశించారు.

**పోలింగ్ రోజున సమన్వయం అత్యంత కీలకం**

పోలింగ్ రోజున సమన్వయం అత్యంత కీలకం అని సీఎం స్పష్టం చేశారు.ప్రతి బూత్ వద్ద ఓటర్లను పోలింగ్ కేంద్రాల వరకూ చేర్చడం, ఎన్నికల ప్రక్రియలో లోపాలు లేకుండా పర్యవేక్షించడం వంటి బాధ్యతలు మంత్రులకే అప్పగించారు. "ఉపఎన్నిక గెలుపు కేవలం ప్రచారంపై కాదు, పోలింగ్ మేనేజ్‌మెంట్‌పై ఆధారపడి ఉంటుంది. ఒక్క ఓటు కూడా వృథా కాకుండా చూడాలి," అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేసినట్లు సమాచారం. సమావేశంలో అంతర్గత సర్వేల నివేదికలను సీఎం సమీక్షించారు.

ఎక్కడ గెలుపు అవకాశాలు బలంగా ఉన్నాయో, ఎక్కడ బలహీనతలు ఉన్నాయో అంచనా వేసి, డివిజన్‌ల వారీగా ప్రత్యేక బాధ్యతలు మంత్రులకు అప్పగించారు. "జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేసే కృషిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి. అభ్యర్థి విజయం వల్ల నియోజకవర్గానికి కలిగే ప్రయోజనాలను వివరించాలి," అని ఆయన సూచించారు. "గడపగడపకు చేరి ప్రజలతో మమేకమై, ప్రభుత్వ పథకాలను వివరించండి. ప్రచారంలో ప్రతి మాట, ప్రతి అడుగు ప్రజల్లో విశ్వాసం కలిగించేలా ఉండాలి," అని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

"బీఆర్ఎస్ సృష్టించే అపోహలను ప్రతి గంటకోసారి సమాధానం ఇవ్వాలి. నిజాలను ప్రజల్లోకి చేర్చాలి," అని సీఎం దిశానిర్దేశం చేశారు. ఉప ఎన్నికకు మిగిలిన మూడు రోజులు అత్యంత కీలకమని సీఎం హెచ్చరించారు. "ఈ సమయాన్ని పూర్తి స్థాయిలో వినియోగించండి. ప్రతి ఓటరికి కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించండి," అని నేతలకు సూచించారు. సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పలు మంత్రులు పాల్గొన్నారు.

# బీహార్ తొలి దశ పోలింగ్ ప్రశాంతం



- 60.18 శాతం పోలింగ్
- గతసారి కంటే 2.84% ఎక్కువ

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

బీహార్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ గురువారం శాంతియుతంగా ముగిసింది. సాయంత్రం ఐదు గంటల వరకు 60.18 శాతం ఓటింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. 2020 ఎన్నికలతో పోలిస్తే ఈసారి 2.84 శాతం అధికంగా పోలింగ్ నమోదైంది.

ఈ దఫా మొత్తం 121 అసెంబ్లీ స్థానాలకు ఓటింగ్ జరిగింది. అయితే కొన్ని చోట్ల స్వల్ప ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. తన కాన్వాయ్‌పై దుండగులు దాడి చేశారంటూ ఉప ముఖ్యమంత్రి విజయ్‌కుమార్ సిన్హా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించి విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఈ దశలో పలు కీలక, హాట్‌సీట్లు ఉన్నాయి. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ రఘోపూర్ నుంచి బరిలో ఉన్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రులు సామ్రాట్ చౌదరి, విజయ్‌కుమార్ సిన్హా పలు మంత్రులు కూడా ఎన్నికల రణరంగంలో ఉన్నారు.

మొత్తం 18 జిల్లాల్లో పోలింగ్ జరిగింది. వీటిలో బెగూసరాయ్ జిల్లాలో అత్యధికంగా 67.32% ఓటింగ్ నమోదైంది. సమస్తిపూర్‌లో 66%, మాధేపురాలో 65% పోలింగ్ రికార్డు అయింది. విశ్లేషకులు ఈసారి ఓటింగ్ శాతం పెరగడాన్ని ప్రజల చురుకుదనంగా అభివర్ణించారు. ఇక, లఖిసరాయ్‌లో ఉద్రిక్తత చోటు చేసుకుంది. నాలుగోసారి పోటీ చేస్తున్న డిప్యూటీ సీఎం విజయ్‌కుమార్ సిన్హా కాన్వాయ్‌ను ఆర్జేడీ మద్దతుదార్లు నిలిపివేశారని ఆయన ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయనకు, ఆర్జేడీ ఎమ్మెల్సీ ఆజయ్‌కుమార్ మధ్య మాటల యుద్ధం నెలకొంది. పరస్పరం తీవ్రస్థాయిలో విమర్శలు చేసుకున్నారు. పోలింగ్ పూర్తయ్యాక ఎన్‌డీఏ, ఇండియా కూటములు రెండు కూడా ఫలితాలపై అంతర్గత విశ్లేషణలు ప్రారంభించాయి.



## విషాహారం తిని 150కు పైగా గొర్రెలు మృత్యువాత

**బలగం టీవి, వేములపల్లి**

వరి పొలాల్లో మేతకు వదిలిన గొర్రెలు విషాహారం తిని 150కు పైగా మృత్యువాతపడ్డాయి. దీంతో కాపరుల జీవితాలు రోడ్డునపడ్డాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రం సమీపంలో గురువారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలోని అన్నారం, అనంతారం, దోసపాడు గ్రామాలకు చెందిన ఉప్పునూతల సైదులు, శ్రీరాముల కోటయ్య, శ్రీరాముల గోపాలు, ఆవుల కోటయ్య, ఆవుల వెంకన్న తమ గొర్రెలను కొన్ని రోజులుగా మండల కేంద్రం సమీపంలోని మడికట్ల(వరి కోసిన పొలాలు)లో మేపుతున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి 80 గొర్రెలు, గురు వారం 70 గొర్రెలకు పైగా మృత్యువాతపడ్డాయి. పొలాల్లో చెల్లాచెదురుగా అక్కడక్కడా పడిపోయాయి. వాటి విలువ సుమారు రూ.30 లక్షలకు పైగా ఉంటుంది. కంటికి రెప్పలా కాపాడుకున్న గొర్రెలు కండ్ల ఎదిటే చెల్లాచెదురుగా పడిపోయి విగతజీవులుగా మారడంతో కాపరులు కన్నీరు మున్నీరవుతున్నారు. తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు. వెటర్నరీ జేడీఏ జివి రమేష్, ఏడీఏ జూలకంటి వెంకట్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని గొర్రెలను పరిశీలించారు. గొర్రెలను చనిపోవడానికి కారణాలను కాపరులను అడిగి తెలుసుకున్నారు. రక్త నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. విష ఆహారంగానీ, విషపు నీరు వల్లగానీ మృత్యువాతపడి ఉండొచ్చని ప్రాథమిక అంచనా వేశారు. వారి వెంట వెటర్నరీ వైద్యులు అశోక్, జ్ఞానేశ్వర్ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

## మూడు రోజుల్లో 550కిపైగా వాహనాలపై కేసులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో మోటారు వాహనాల చట్టాలను ఉల్లంఘి స్తున్న వారిపై రవాణాశాఖ కొరడా ఝులిపిస్తోంది.ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో ఆ శాఖ ప్రత్యేకించి ఓవర్‌లోడ్ వాహనాలపై కఠిన చర్యలు చేపట్టింది. గత మూడు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 550కిపైగా వాహనాలపై కేసులు నమోదు చేసినట్టు రవాణాశాఖ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఇందులో 60కిపైగా ఓవర్‌లోడ్‌తో నడుస్తున్న వాహనాలు ఉన్నాయని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి ఈనెల 6వరకు మోటారు వాహనాల చట్టాలను ఉల్లఘించిన 1,15,000కుపైగా వాహనాలపై కేసులు నమోదు చేశామని రవాణా శాఖ తెలిపింది. ఇందులో 5వేలకుపైగా ఓవర్ లోడ్‌తో తిరుగుతున్న వాహనాలు కాగా, 9వేలకుపైగా ప్రయివేట్ బస్సులు ఉన్నాయనీ, ఇవే కాకుండా ఫిట్‌నెస్ లేని వాహనాలు, టాక్స్ లేకుండా తిరిగే వాహనాలతో పాటు పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి ధ్రువపత్రాలు లేని వాహనాలు కూడా పెద్దసంఖ్యలో ఉన్నాయని పేర్కొంది. ఇటీవల చేవెళ్ల సమీపంలో ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ కారణంగా ఘోర ప్రమాదం జరగడంతో రవాణాశాఖ అప్రమత్తమైంది. రాష్ట్రంలోని 33 జిల్లాల రవాణా శాఖ అధికారులకు ఓవర్‌లోడ్ వాహనాలపై తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశాలు జారీ చేసినట్టు పేర్కొంది. ఈనేపథ్యంలోనే గత మూడు రోజులుగా విస్తృత తనిఖీలు చేపట్టి, నిబంధనలు



ఉల్లఘించిన వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఓవర్‌లోడ్ సమస్యను మూలాల నుంచి అరికట్టేందుకు రవాణా శాఖ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. త్వరలో మైనింగ్ శాఖ అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపింది. వాహనాలకు లోడ్ వేసే రీచ్‌లు, క్వారీలలోనే ఓవర్‌లోడ్‌ను నిరోధించే విధంగా కఠిన చర్యలు తీసుకునేందుకు ఈ సమావేశంలో చర్చిస్తామని రవాణాశాఖ తన ప్రకటనలో స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు రోడ్డు భద్రతా కమిటీ కూడా గనుల శాఖ, రవాణా శాఖలు సమన్వయంతో పనిచేసి క్వారీల వద్దే ఓవర్‌లోడింగ్‌ను నిరోధించాలని ఆదేశాలు జారీ చేసింది. వాహన యజమానులు, డ్రైవర్లు నిబంధనలు పాటిస్తూ, సురక్షిత ప్రయాణానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఫిట్‌నెస్ లేని వాహనాలను సీజ్ చేయాలి

- చేవెళ్ల రోడ్డు ప్రమాదంపై సుప్రీంకోర్టు కమిటీ సమీక్ష

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

చేవెళ్ల రోడ్డు ప్రమాదంపై సుప్రీంకోర్టు రోడ్డు భద్రత కమిటీ గురువారం సమీక్ష నిర్వహించింది. సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ఛైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ అభయ్ మనోహర్ సప్రే, సభ్యుడు సంజయ్ బందోపాధ్యాయ్ హైదరాబాద్‌కు విచ్చేసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. చేవెళ్ల వద్ద ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి గల కారణాలను కమిటీ అడిగి తెలుసుకుంది. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ప్రమాదం జరిగిన విధానం, కారణాలను వివరించారు. ఆర్టీసీ బస్సుల ఫిట్‌నెస్‌తో పాటు ప్రైవేట్, కమర్షియల్ వాహనాలను కూడా పునః తనిఖీ చేసి ఫిట్‌నెస్ లేని వాహనాలను వెంటనే సీజ్ చేయాలని కమిటీ అధికారులను ఆదేశించింది.

ప్రతి వాహనం ఇన్సూరెన్స్, పర్మిట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ అధికారులకు సూచించింది. అలాగే జాతీయ రహదారి విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులను ఆదేశించింది. మైనింగ్ క్వారీల నుంచి అధిక లోడింగ్ జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని మైనింగ్, రవాణా శాఖలకు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రోడ్డు భద్రతా నిధి ఏర్పాటు చేయాలని కమిటీ సూచించింది. ఈ సమావేశంలో రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి, అడిషనల్ డీజీ మహేష్ భగవత్, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, మైనింగ్ డైరెక్టర్ భవేశ్ మిశ్రా, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య, అలాగే ఆర్టీసీ, ఎన్.హెచ్.ఎ.ఐ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్-బీఆర్ఎస్‌కి చీకటి ఒప్పందం

- కేటీఆర్ అరెస్టుపై రాహుల్ మౌనం...
- జూబ్లీహిల్స్‌లో బీజేపీ గెలుస్తుంది
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాబోయే ఉప ఎన్నికల నేపథ్యంలో రాజకీయ వేడి పెరుగుతోంది. కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జీ. కిషన్‌రెడ్డి గురువారం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "ఢిల్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు చీకటి ఒప్పందం ఉంది," అని ఆయన ఆరోపించారు. మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో మాట్లాడుతూ "కేటీఆర్ అరెస్ట్‌ను రాహుల్ గాంధీ ఒప్పుకోట్లేదు. రేవంత్ రెడ్డి మాటలు పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఆయన అన్ని పార్టీల్లో తిరిగారు, ఇప్పుడు మజ్లిస్ మాత్రమే మిగిలింది," అన్నారు. "కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక గాంధీభవన్‌లో కాదు, మజ్లిస్ పార్టీ ఆఫీస్‌లో జరిగింది. ముస్లింలపై ప్రేమ ఉంటే అజారుద్దీన్‌కు టికెట్ ఎందుకు ఇవ్వలేదు? ఆయనకు పదవి ఇచ్చి, ఇప్పుడు ఎందుకు పక్కన పెట్టారు?" అని ప్రశ్నించారు. "కాంగ్రెస్ బీసీలకు కేవలం 32 శాతం టికెట్లు ఇచ్చింది. ముస్లింలకు 10 శాతం ఇచ్చారు. రాష్ట్రంలో 56 శాతం బీసీలు ఉన్నా, వారిని విస్మరించారు," అని విమర్శించారు.

"రేవంత్ రెడ్డి మజ్లిస్ మెప్పుకోసమే పని చేస్తున్నారు.



అసదుద్దీన్ ఓవైసీ 'నేను దేశం మొత్తం స్పెషల్ ఫ్లైట్‌లో తిరుగుతా' అంటున్నారు. కేసీఆర్ ఫార్మ్‌హౌస్‌లో ఉన్నాడు, రేవంత్ పరిస్థితి కూడా అంతే," అని వ్యాఖ్యానించారు. "మజ్లిస్, కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పార్టీలు. భవిష్యత్తులో బీజేపీకి బీఆర్ఎస్‌తో కలిసే ప్రసక్తే లేదు," అని స్పష్టం చేశారు. "జూబ్లీహిల్స్ వెనుకబాటుకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే కారణం. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అక్కడ బీజేపీ గెలవలేదు కానీ, ఈసారి ఉప ఎన్నికల్లో బీజేపీ ఖచ్చితంగా గెలుస్తుంది," అని ధీమా వ్యక్తం చేశారు. "మా ర్యాలీని పోలీసులు అడ్డుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తాం, ఎలెక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం," అని చెప్పారు.

# జగద్గిరిగుట్ట హత్య కేసును చేధించిన పోలీసులు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మేడ్చల్ జిల్లా,జగద్గిరిగుట్ట బస్టాండ్ ప్రాంతంలో ఒక రౌడీ షీటర్ పై మరో రౌడీషీటర్ కత్తితో దాడికి పాల్పడిన ఘటన సంచలనం సృష్టించింది తెలిసిందే.ఈ ఘర్షణ పాతకక్షలే కారణం అని పోలీసులు తేల్చారు.హత్యకు గురైన వ్యక్తి మృతిచెందగా దాడికి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి గురువారం రిమాండ్ కి తరలించారు.ఈ హత్యకేసు కు సంబంధించిన వివరాలు గురువారం షాపూర్ నగర్ లోని,బాలనగర్ డిసిపి కార్యాలయంలో మేడ్చల్ డిసిపి కోటిరెడ్డి,ఎస్ఓటి డిసిపి.శోభన్ కుమార్,బాలానగర్ జోన్ ఏసీపీ.పింగళి నరేష్ రెడ్డి,తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జగద్గిరిగుట్ట ప్రాంతం జగద్గిరినగర్ కు చెందిన టి.బాలశౌ రెడ్డి అలియాస్ బాద్ షా(21)పాత నేరస్థుడు.షరీఫ్ అనే వ్యక్తితో గత కొంతకాలంగా వీరిద్దరికి పాత కక్షలు నడుస్తున్నాయి.ఈ గొడవతో షరీఫ్ సన్నిహితుడైన రంగారెడ్డినగర్,పంచశీల కాలనీకి చెందిన రోషన్ కుమార్ సింగ్(26)పాత నేరస్థుడు.ఇతను జోక్యం చేసుకొని తన స్నేహితుడు షరీఫ్ విషయంలో తలదూర్చితే అంతుచూస్తానని బాలశౌరెడ్డిని పలుమార్లు బెదిరింపులకు గురిచేసాడని పోలీసులు తెలిపారు.ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న బాలశౌరెడ్డి తనకు ప్రమాదం ఉందని తెలిసి ముందస్తుగా రోషన్ ను చంపాలని పన్నాగం వేసాడు.అందుకు అమెజాన్ లో కత్తిని బుక్ చేసిన కొనుగోలు చేసాడు.అనంతరం జగద్గిరిగుట్ట ప్రాంతానికి చెందిన తన స్నేహితులైన సయ్యద్ మహమూద్ (28)ఆదిల్ (26) ల సహకారంతో రోషన్ ను హత్య చేసేందుకు బుధవారం పక్కా స్కెచ్ వేశాడు.జగద్గిరిగుట్ట బస్ స్టాప్ కు మాట్లాడుకుందామని రా పిలిపించాడు. అక్కడికి చేరుకున్న రోషన్ తో బాలశౌ రెడ్డికి మాటమాట పెరగడంతో మహమూద్ రోషన్ ను వెనుక నుండి



పట్టుకోగా బాలశౌరెడ్డి తాను తెచ్చుకున్న కత్తితో ఛాతి,పొత్తి కడుపు,వీపు పలుచోట్ల విచక్షణ రహితంగా పొడిచాడు.అందరూ చూస్తుండగానే ఈ దారుణ ఘటన చోటు చేసుకోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు..తీవ్ర రక్తస్రావంతో వారిద్దరి నుండి రోషన్ వారి నుండి కాలర్ వదిలించుకొని పరుగులు తీశాడు.సమీపంలోనే నిందితుడు బాలశౌరెడ్డి మరో స్నేహితుడు ఆదిల్ బుల్లెట్ వాహనం పై ముగ్గురు కలిసి అక్కడికి నుండి పరారయ్యారు.దీంతో తీవ్ర గాయాల పాలైన రోషన్ ను స్థానికులు జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించారు.స్థానికంగా ఉన్న మెడిటెక్ ఆసుపత్రికి తరలించారు.పరిస్థితి విషమించడంతో గాంధీ తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి రోషన్ మృతి చెందాడు.ఈ సంఘటనతో రంగంలోకి దిగిన ఎస్ఓటి విభాగం డిసిపి.శోభన్ కుమార్ పర్యవేక్షణలో బాల నగర్ ఏసిపి.పి.నరేష్ రెడ్డి జగద్గిరిగుట్ట సిఐ.బి. వెంకటేశం,ఎస్ఓటి సిఐ.శివకుమార్ పలు బృందాలుగా ఏర్పడి నిందితులు ముగ్గురిని రాత్రి వరకు పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు.పాతకక్షలే ఈ హత్యకు దారి తీసాయని డీసీపీ.కోటిరెడ్డి వెల్లడించారు. గంటల వ్యవధిలోనే ఈ హత్య కేసుకు సంబంధించిన నిందితులను గంటల వ్యవధి లోనే పట్టుకోవడంలో తమ పోలీసు అధికారులు,సిబ్బంది ప్రదర్శించిన తీరును డీసీపీ అభినందించారు.ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట, ఎస్ఓటి ఎస్సైలు,సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారాల

## దరఖాస్తులకు 25 వరకు గడువు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారాలకు (2024, 2025 సంవత్సరాలకు) సూచనలతో పాఠకులు, రచయితలు తమ దరఖాస్తులకు ఈ నెల 25లోపు పంపించాలని ఆ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు సూచించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వివిధ ప్రక్రియల్లో రచనలు 2021 జనవరి నుంచి 2024 మధ్యకాలంలో తొలిసారిగా ప్రచురించి పాఠకులు ఉత్తమంగా భావించిన వాటిని పరిగణనలోకి తీసుకోనున్నట్టు తెలిపారు. వచన కవిత, పద్యకవిత, బాలసాహిత్యం, నవల, కథానికల సంపుటి, నాటకం, నాటిక సంపుటి, సాహిత్య విమర్శ, అనువాద సాహిత్యం, వచన రచన, రచయిత్రి ఉత్తమ గ్రంథం అనే 10 ప్రక్రియల్లో అన్నింటికీ లేదా కొన్నింటికీ తమకు నచ్చిన గ్రంథాలను పురస్కా రాలకు సూచించవచ్చని వెల్లడించారు. గడువులోగా రిజిస్ట్రార్, సురవరం ప్రతాప రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం, బాచుపల్లి ప్రాంగణం, సాయినగర్ రోడ్, మేడ్చల్ –మల్కాజిగిరి, హైదరాబాద్–500118 చిరునామాకు పంపించాలని కోరారు.

# అక్రమ బెట్టింగ్ యాప్‌లపై ఈడీ కొరడా

- భారత మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్ రూ.11.14 కోట్లు విలువగల ఆస్తులు స్వాధీనం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అక్రమ బెట్టింగ్ యాప్‌ల కేసులో భారత మాజీ క్రికెట్ ఆటగాళ్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చర్యలు చేపట్టింది. వీరిద్దరికీ చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ఈడీ గురువారం ప్రకటించింది. రైనా పేరుతో ఉన్న రూ.6.64 కోట్ల మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్మెంట్లు, ధావన్ పేరుతో ఉన్న రూ.4.5 కోట్ల స్థిరాస్తిలను ఈడీ అటాచ్ చేసినట్లు వివరించింది. ఈ చర్యలు విదేశీ బెట్టింగ్ సంస్థ "1xBetమరియు దాని అనుబంధ సంస్థలు పై కొనసాగుతున్న దర్యాప్తులో భాగమని అధికారులు తెలిపారు. ఈ సంస్థలతో ఇద్దరు క్రికెటర్లు ప్రమోషన్ ఒప్పందాలు చేసుకుని ప్రచార కార్యక్రమాలు నిర్వహించారని, ఆ చెల్లింపులు అనుమానాస్పద విదేశీ మార్గాల ద్వారా జరిగాయని విచారణలో తేలింది. అవి అక్రమ బెట్టింగ్ కార్యకలాపాల నిధులే అని ఈడీ నిర్ధారించింది.

ఈడీ దర్యాప్తులో "1xBet సంస్థ దేశవ్యాప్తంగా 6,000కి పైగా నకిలీ బ్యాంకు ఖాతాలు (మ్యూల్ అకౌంట్లు) ద్వారా నిధులు చలామణి చేసినట్లు తేలింది. పేమెంట్ గేట్‌వేలు, ఫేక్ వ్యాపార ఖాతాల ద్వారా డబ్బులు బదిలీ అవుతున్నట్లు గుర్తించారు. ఇందులో చాలావరకు %ఖ్జ% ధృవీకరణ లేకుండా లావాదేవీలు జరిగినట్లు ఈడీ తెలిపింది.ఇప్పటికే నాలుగు పేమెంట్ గేట్‌వేలపై దర్యాప్తు



జరిపి, 60 బ్యాంకు ఖాతాల్లో రూ.4 కోట్లకు పైగా మొత్తాన్ని స్తంభింపజేసినట్లు వెల్లడించారు.

అనుమానాస్పద యాప్‌లతో వ్యక్తిగత లేదా బ్యాంకు వివరాలు పంచుకోవద్దని ప్రజలను ఈడీ హెచ్చరించింది. అక్రమ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ కార్యకలాపాల్లో తెలియకుండానే పాల్గొన్నా కూడా %ూమీూా% చట్టం కింద శిక్షార్హులు అవుతారని పేర్కొంది. ఈ చట్టం ప్రకారం, నేరం నిర్ధారితమైతే ఏడేళ్ల వరకు జైలు శిక్ష విధించవచ్చని తెలిపింది.

రైనా, ధావన్ ప్రకటన ఒప్పందాల ద్వారా నిధుల మూలం గోప్యంగా ఉంచబడిందని, వీరిద్దరూ దానిలో భాగస్వామ్యులైనట్లు ప్రాథమిక సాక్ష్యాలు ఉన్నాయని ఈడీ పేర్కొంది. ఈ కేసు వెనుక ఇంకా ఎంతమంది ప్రముఖులు, ఆర్థిక సంస్థలు ఉన్నాయో తెలుసుకునేందుకు దర్యాప్తు కొనసాగుతోంది. ఈడీ అధికారులు తెలిపారు "ఇలాంటి బెట్టింగ్ ప్లాట్‌ఫారమ్‌లు కేవలం జూదానికి వేదికలే కాదు, మనీ లాండరింగ్, పన్ను ఎగవేత, ఆర్థిక మోసాలకు ప్రధాన కేంద్రమవుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి" అని హెచ్చరించారు.



## ఫీజులను విడుదల చేయకుంటే చలో హైదరాబాద్

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు

**బలగం టీవి, హైదరాబాద్**

రాష్ట్రంలో గత ఆరేండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ ఫీజులను వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు కండ్లకు గంతలు కట్టుకుని నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 23 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. గత ఆరేండ్ల నుంచి సుమారు రూ.8 వేల కోట్లకు పైగా ఉన్న ఫీజు బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు.విద్యా సంస్థల యజమాన్యాలు సమ్మె ప్రకటించి ఏడాది కాలంగా పోరాడితే రూ.1200 కోట్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. హామీ మరిచిందని అన్నారు. కాలేజీ యజమాన్యాలు ఫీజులు రాలేదనే పేరుతో ఫీజు రీయంబర్స్ మెంట్స్ విద్యార్థుల నుంచి బలవంతంగా వసూళ్లు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు భరోసా ఇచ్చేలా ఫీజుల చెల్లింపు కోసం జీవో ఇచ్చి వారి భవిష్యత్తు నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యా శాఖ మంత్రిగా సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని, కానీ 23 నెలల నుంచి పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి ఈ నెలలో పూర్తి బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులతో 'చలో హైదరాబాద్' నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అశోక్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్, జె.రమేష్, హైదరాబాద్ జిల్లా నాయకులు నాగేందర్, రజినీకాంత్, కైలాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్జేడీ, కాంగ్రెస్‌లవి ఓటు బ్యాంకు రాజకీయాలు

- ప్రధాని నరేంద్ర మోదీ

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీహార్ ఎన్నికల వాతావరణం ఉత్కంఠగా మారింది. ఓటు బ్యాంకు రాజకీయాలతో ఆర్జేడీ, కాంగ్రెస్ ఉమ్మడి భాగస్వాములు చొరబాటుదారుల పట్ల సానుభూతి చూపుతూ, పరమాత్ముడు శ్రీరామునిపై, ఛఠీమైయా (సూర్యభగవానుని సోదరి)పై వ్యతిరేకత చూపుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విమర్శించారు. గురువారం బీహార్‌లోని భాగల్పూర్, అరారియా జిల్లాల్లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీల్లో ప్రసంగించిన ఆయన, విపక్ష నాయకులు అయోధ్యలోని నిషధరాజ్, మాతా శబరి, మహర్షి వాల్మీకి వంటి పుణ్యక్షేత్రాలను సందర్శించడానికి కూడా మొగ్గు చూపడం లేదని ఎద్దేవా చేశారు.

"15 ఏళ్ల 'జంగిల్‌రాజ్'లో అభివృద్ధి సున్నా. కానీ నితీశ్‌కుమార్ నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చాకే రాష్ట్రం వేగంగా ఎదిగింది. అనేక ఎక్స్‌ప్రెస్‌వేలు, బ్రిడ్జిలు, నాలుగు సెంట్రల్ యూనివర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థలు ఏర్పడ్డాయి," అని మోదీ వివరించారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర'ను పరోక్షంగా విమర్శిస్తూ "ఓటు చోరీ జరిగిందన్న తప్పుడు కథనాలతో రాజకీయ



యాత్రలు చేస్తున్నారు. ప్రజలు నిజం తెలుసుకున్నారు," అన్నారు.

భాగల్పూర్ 1989 మత ఘర్షణలు, 1984 సిక్కు వ్యతిరేక హింసలు కాంగ్రెస్ రెచ్చగొట్టిందని, కులహింసలను ఆర్జేడీ ప్రేరేపించిందని మోదీ ఆరోపించారు. ఆర్జేడీ ప్రచార పోస్టర్లపై రాహుల్ గాంధీ ఫోటో లేకపోవడంపై కాంగ్రెస్ లోపలే విభేదాలు చెలరేగుతున్నాయని ఎద్దేవా చేశారు. "ఎన్నికల తర్వాత ఇండియా కూటమి నేతలు పరస్పరం కుమ్ములాడుకుంటారు. ప్రజలు ఈ కూటమి నాటకాన్ని బాగా అర్థం చేసుకున్నారు," అని మోదీ వ్యాఖ్యానించారు.

# నా కూతుళ్లు నాకు పంపిన జీతమా ఇది..



● ప్రమాదం బాధితుడి గుండెకోత..

**బలగం టీవీ, రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల వద్ద ఇటీవల జరిగిన ఘోర ఆర్టీసీ బస్సు ప్రమాదం ఒకే కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఈ దుర్ఘటనలో తాండూరుకు చెందిన ఎల్లయ్య గౌడ్ ముగ్గురు కుమార్తెలు దుర్మరణం పాలైన సంగతి తెలిసిందే. ప్రమాదంలో కూతుళ్లను కోల్పోయిన ఆ తండ్రికి ప్రభుత్వం తరఫున నష్ట పరిహారం అందిస్తున్న సమయంలో చోటుచేసుకున్న హృదయ విదారక సన్నివేశం అక్కడున్న అందరినీ కంటతడి పెట్టించింది.

ప్రమాదంలో మరణించిన ముగ్గురు కూతుళ్లకు ఒక్కొక్కరికి రూ. 7 లక్షల చొప్పున, మొత్తం రూ. 21 లక్షల చెక్కును ప్రభుత్వం ఎల్లయ్య గౌడ్ కుటుంబానికి అందించింది. నష్ట పరిహారం చెక్కును అందుకున్న ఎల్లయ్య గౌడ్ గుండెలవిసేలా రోదించారు. "నా రెండో కూతురు ఉద్యోగం చేస్తూ నెలకు రూ. 60 వేలు సంపాదించేది. ఇప్పుడు ముగ్గురు కలిసి నాకు పంపించిన జీతమా ఇది..? అంటూ కన్నీరుమున్నీరయ్యారు.

చదువులు, ఉద్యోగాల కోసం హైదరాబాద్ వెళ్తూ ప్రమాదానికి గురై మరణించిన తమ ముగ్గురు కుమార్తెలను తలచుకొని ఆ తండ్రి పడిన వేదన అక్కడి వాతావరణాన్ని విషాదమయం చేసింది. ఆయన ఆవేదన అక్కడి ప్రజల గుండెల్ని కదిలించింది.

## కామారెడ్డి కలెక్టరేట్‌లో నకిలీ ఐఏఎస్ హల్‌చల్..

**ఉద్యోగం వచ్చిందని నమ్మించడానికి విఫలయత్నం..**

**బలగం టీవీ, కామారెడ్డి:**

కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నకిలీ ఐఏఎస్ అధికారిణి కలకలం సృష్టించింది. తాను ఇన్‌చార్జి కలెక్టర్‌గా వచ్చానంటూ నకిలీ ఉత్తర్వులతో ఓ మహిళ హంగామా చేయగా, ఇది ఉద్యోగం వచ్చిందని కుటుంబ సభ్యులను నమ్మించేందుకు చేసిన విఫల ప్రయత్నంగా పోలీసులు నిర్ధారించారు.

జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఈ నెల 2వ తేదీ నుండి సెలవులో ఉండటంతో, ఇన్‌చార్జి కలెక్టర్‌గా నిజామాబాద్ కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే, ఈ నెల 4వ తేదీన హైదరాబాద్‌లోని జీడిమెట్లకు చెందిన ఇస్రత్ జహాన్ అనే మహిళ



కారులో కామారెడ్డి కలెక్టరేట్‌కు చేరుకుంది. తాను ఇన్‌చార్జి కలెక్టర్‌గా నియమించబడ్డానంటూ నకిలీ ఉత్తర్వులను అదనపు కలెక్టర్‌కు చూపించింది. అనుమానం వచ్చిన అదనపు కలెక్టర్, ఆ ఉత్తర్వులను ప్రభుత్వానికి పంపి, ఆదేశాలు వచ్చాక తమ నిర్ణయాన్ని చెబుతామని మహిళకు తెలిపారు. కాసేపు కలెక్టర్ ఛాంబర్‌లో కూర్చుని ఇస్రత్ జహాన్ అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఆమె ప్రవర్తనపై అనుమానంతో కలెక్టరేట్ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ఆమెను తూప్రాన్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.

**పోలీసుల విచారణలో అసలు విషయం వెలుగులోకి..**

విచారణలో, ఇస్రత్ జహాన్ 2020 నుండి గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతోందని, ఉద్యోగం వచ్చిందని తన కుటుంబ సభ్యులను నమ్మించేందుకే ఈ ప్రయత్నం చేసిందని పోలీసులు నిర్ధారించారు. ఎవరినీ మోసం చేయాలనే ఉద్దేశం లేదని తేలడంతో, ఆమెపై చీటింగ్ కేసు నమోదు చేసి వదిలిపెట్టారు.

## సత్యనారాయణరావు దశదినకర్మలో కేటీఆర్

**హరీశ్‌రావు కుటుంబ సభ్యులను పరామర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్**

**బలగం టీవీ, హైదరాబాద్**



మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి. హరీశ్‌రావు తండ్రి తన్నీరు సత్యనారాయణరావు దశదినకర్మ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన హరీశ్‌రావుతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. అనంతరం తన్నీరు సత్యనారాయణరావు చిత్రపటానికి నివాళులర్పించారు. నార్సింగిలోని ఓం కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హరీశ్‌రావు మద్దతుదారులు, బీఆర్ఎస్ శ్రేణులు భారీగా హాజరై పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. గత నెల 28వ తేదీన తెల్లవారుజామున తన్నీరు సత్యనారాయణరావు కన్నుమూసిన విషయం తెలిసిందే.

## మాగంటి సునీతను గెలిపించాలి

● **మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతల ప్రెస్‌మీట్‌లో మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, కార్పొరేటర్లు దేదీప్య, మందాడి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నేతలు జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతను గెలిపించాలని ప్రజలను కోరారు. నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ "ఎన్టీఆర్ అభిమానిగా గోపీనాథ్ పనిచేశారు. ఆయన అకాల మరణంతో ఏర్పడిన ఉపఎన్నికలో సునీతకు కేసీఆర్ అవకాశం ఇచ్చారు. 1983 నుండి ఎన్టీఆర్ వెంట నడిచిన మాగంటి గోపీనాథ్ వంటి నేతను మూడు సార్లు ఆదరించినట్లే సునీతను ప్రజలు ఆదరించాలి," అన్నారు. "కేసీఆర్ సీఎంగా ఉన్న పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం, ముఖ్యంగా హైదరాబాద్ అభివృద్ధి అద్భుతంగా జరిగింది. రాజకీయ ప్రయోజనాల కోసం ఎన్టీఆర్ విగ్రహం పేరుతో ప్రచారం చేసే వారు రేపు ఏ పార్టీలో ఉంటారో ఎవరికీ తెలియదు. రెండు ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం వెనుకబడిపోయిందని ప్రజలందరికీ అర్థమవుతోంది. జూబ్లీహిల్స్ ప్రజలు అభివృద్ధిని చూసి తీర్పు ఇవ్వాలి," అని పిలుపునిచ్చారు.

మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ 'మాగంటి గోపీనాథ్ ఎన్టీఆర్ పట్ల ఎంత విశ్వాసం కలిగి ఉన్నారో, కేసీఆర్ పట్ల అంతకంటే ఎక్కువ విశ్వాసం కలిగి ఉన్నారు. ఆయన మరణంతో కేసీఆర్ తీవ్రంగా మానసికంగా బాధపడ్డారు. మాగంటి సునీత కన్నీళ్లను కూడా మంత్రులు వెటకారం చేయడం బాధాకరం. ఒక ఆడబిడ్డపై అంత నీచంగా మాట్లాడటం తగదు. కేసీఆర్ ప్రతి వర్గానికి గుర్తింపు ఇచ్చిన నాయకుడు," అన్నారు.

ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ "జూబ్లీహిల్స్‌లో గెలవబోమని కాంగ్రెస్ కూడా అర్థం చేసుకుంది. మతం, కులం పేరుతో దిగజారి రాజకీయాలు చేస్తున్నారు. తుమ్మల నాగేశ్వరరావు గెలవకపోయినా కేసీఆర్ మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అలాంటి నేతపై దుర్మార్గ ప్రచారం చేయడం తగదు. మాగంటి సునీత గెలుపు ఖాయం," అన్నారు.

మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ "కులాలకు అతీతంగా అభివృద్ధి చేసిన నాయకుడు మాగంటి గోపీనాథ్. కేసీఆర్ తెలంగాణను అద్భుతంగా అభివృద్ధి చేశారు. కులాల పేరుతో రాజకీయాలు చేయడం ప్రజలకు మోసం చేయడమే," అన్నారు. కార్పొరేటర్లు దేదీప్య, మందాడి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ "జూబ్లీహిల్స్‌లో ప్రతి గల్లీకి మాగంటి గోపీనాథ్ అభివృద్ధి జ్ఞాపకం ఉంటుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లలోనే విఫలమైంది. రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా మారాయి. మాగంటి సునీత విజయం ఖాయం. కుల, మతాలకు అతీతంగా అభివృద్ధి కోసం ఓటేయాలి," అని చెప్పారు.

## చీమల భయంతో ఉరేసుకుని మహిళ ఆత్మహత్య..

**బలగం టీవీ, సంగారెడ్డి**



సంగారెడ్డి జిల్లా అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నవ్య హెూమ్స్ కాలనీలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. చిన్నప్పటి నుండి చీమలంటే విపరీతమైన భయం (మైర్మోకోఫోబియా) ఉన్న కారణంగా చిందం మనీషా (25) అనే వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చిందం మనీషా (25) మైర్మోకోఫోబియా (చీమలంటే భయం) ఈ విషయాన్ని సీఐ నరేష్ ధృవీకరించారు. 2022లో శ్రీకాంత్ (35)తో మనీషాకు వివాహం జరిగింది. వారికి అన్వికా (3) అనే కూతురు ఉంది.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మనీషాకు చిన్నప్పటి నుంచే చీమలంటే విపరీతమైన భయం ఉండేది. ఆమె భర్త శ్రీకాంత్ డ్యూటీకి వెళ్ళిన సమయంలో ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది.ఘటనా స్థలంలో పోలీసులకు ఆత్మహత్య లేఖ లభించింది. లేఖలో మనీషా తన కూతురును ఉద్దేశించి, "ఐయాం సారీ అన్వి జాగ్రత్త" అని రాసింది. అంతేకాకుండా, తన భర్తను కొన్ని కోరికలు తీర్చాల్సిందిగా కోరింది.. అన్నవరం, తిరుపతి హుండీలలో రూ. 1116 వేయాలి. ఎల్లమ్మ (దేవత)కు బియ్యం పోయడం మర్చిపోవద్దని పేర్కొంది. ఈ సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. కేవలం చీమల భయం కారణంగానే మనీషా ఆత్మహత్య చేసుకుని ఉంటుందని ప్రాథమికంగా పోలీసులు నిర్ధారించారు.



## రామోజీ గ్రూప్ ఫౌండేషన్ డే వేడుకలకు సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం..

● **ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రాన్ని అందజేసిన రామోజీ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్. కిరణ్**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని రామోజీ గ్రూప్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్ కిరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, ఈ నెల 16న జరగనున్న 'రామోజీ గ్రూప్ ఫౌండేషన్ డే' వేడుకల్లో భాగంగా నిర్వహించే "రామోజీ ఎక్సలెన్స్ అవార్డుల" ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్యమంత్రి ని ఆయన ఆహ్వానించారు.



## సీఎంపై చర్యలు తీసుకోవాలి

● **రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని కలిసిన బీఆర్ఎస్ నేతలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆర్కే భవన్‌లో రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని బుధవారం శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనా చారి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, మహమ్మద్ షకీల్ అమీర్, బీఆర్ఎస్ నేతలు పల్లె రవికుమార్, కిషోర్ గౌడ్, సల్మాన్ ఖాన్ మరియు ఇతర మైనార్టీ నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు. ముస్లింలపై జరుగుతున్న దాడులు, అలాగే సీఎం రేవంత్ రెడ్డి ముస్లింలపై చేసిన వ్యాఖ్యలుపై ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల ప్రధానాధికారిని కోరారు. నేతలు తమ ఫిర్యాదులో, రాష్ట్రంలో ముస్లింలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఎన్నికల నియమావళి ప్రకారం సమాన న్యాయం జరగాలని కోరారు. బీఆర్ఎస్ ముఖ్య నేతలు, మైనార్టీ నాయకులు వేర్వేరుగా సుదర్శన్ రెడ్డికి ఫిర్యాదులు అందజేశారు. సీఈవో వారు ఫిర్యాదులను స్వీకరించి తగిన చర్యలు తీసుకుంటామని నాయకులకు హామీ ఇచ్చినట్లు సమాచారం.

## ఒకే ట్రాక్‌పై ఎదురెదురుగా రెండు రైళ్లు

**బలగం టీవీ, బిలాస్‌పూర్**

ఛత్తీస్‌గఢ్ బిలాస్‌పూర్‌లో జరిగిన రైలు ప్రమాదంలో 11మందికి పైగా ప్రయాణికులు మరణించిన ఘటనను మరువకే ముందు అదే జిల్లాలో మరో ప్రమాదం జరగకుండా తృటిలో తప్పింది. బిలాస్‌పుర్‌లో ఒకే ట్రాక్‌పై రెండు రైళ్లు వచ్చాయి. ఒకే ట్రాక్‌పై రైళ్లు ఎదురుగా రావడంతో ప్రయాణికులు షాక్‌కు గురయ్యారు. మరో ప్రమాదం జరుగుతుందని భయపడి, ప్రయాణికులు రైలు నుంచి ముందుగానే దిగిపోయారు. ప్రమాదం లేదని అధికారులు తెలపడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. . ఈ ఘటన బిలాస్‌పుర్‌లోని కోట్మి సోనార్, జైరాంనగర్ మధ్య జరిగింది. అప్పటికే ప్యాసింజర్ ట్రైన్ ఆగి ఉన్న ట్రాక్‌పైకి గూడ్స్ రైలు వచ్చింది. రెండు రైళ్లు ఒకే ట్రాక్‌పై రావడంతో ప్రయాణికులు మరో ప్రమాదం జరుగుతుందని భయడ్డారు. దీంతో వెంటనే కిందకు దిగారు. అయితే ట్రాక్ మార్చడానికి ఇది ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ అని అధికారులు చెప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఎటువంటి ప్రమాదం లేదని తేలిన తర్వాత, ప్రయాణికులు మళ్ళీ రైలు ఎక్కారు.

# ఆరోగ్యశాఖలో సేవ చేసే అవకాశం అదృష్టం

- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- కొత్తగా అలకేట్ అయిన గ్రూప్-1 ఆఫీసర్లను అభినందించిన ఆరోగ్యశాఖ మంత్రి



**బలగం టీవీ, హైదరాబాద్**

ఆరోగ్యశాఖకు అలకేట్ అయిన గ్రూప్-1 అధికారులు గురువారం సెక్రటేరియట్‌లో ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి కొత్త అధికారులను అభినందిస్తూ, “ఆరోగ్యశాఖలో పనిచేసే అవకాశం దక్కడం నిజంగా అదృష్టం. అనారోగ్యంతో ఆపదలో ఉన్నవారికి సేవ చేసే అవకాశం ఈ శాఖలో ఎక్కువగా ఉంటుంది,” అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు అత్యంత పేద ప్రజలు వస్తుంటారని, వారిని ప్రేమతో, అప్యాయంగా చూసుకునే బాధ్యత ప్రతి ఒక్కరిదని మంత్రి స్పష్టం చేశారు. ప్రజల్లో ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకాన్ని పెంచేలా నాణ్యమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ హాస్పిటళ్ల పనితీరు, ఆరోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వాడకం, గ్రామీణ ప్రాంత ప్రజల చెంతకు స్పెషాలిటీ వైద్య సేవలు తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై వివరాలు వెల్లడించారు. ఒకప్పటిలా అంటువ్యాధుల సమస్య ఇప్పుడు తక్కువగా ఉన్నా, లైఫ్ స్టైల్ డిసీజెస్ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) కేసులు పెరుగుతున్నాయని, ఈ పరిస్థితిని అధికారులు గమనించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రతి జిల్లాలో డే కేర్ కేన్సర్ సెంటర్లు, ఎన్‌సీడీ క్లినిక్స్ ఏర్పాటు చేశామని, వాటి ద్వారా రోగులకు వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఆధునికత, టెక్నాలజీతో వైద్య సేవల నాణ్యతను మెరుగుపరచే దిశగా కొత్త అధికారుల ఆలోచనలు ఉపయోగపడాలని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు.



## బీఆర్ఎస్ పార్టీ నాయకుడిని పరామర్శించిన చల్మెడ..

**బలగం టీవీ, వేములవాడ**

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు ఈరోజు పార్టీ సీనియర్ నాయకుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వేములవాడ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు హింగే కుమార్ తండ్రి లింగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, వారి స్వగ్రామమైన ఆరెపల్లి గ్రామంలో ఈరోజు ద్వాదశ దినకర్మ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై, హింగే కుమార్ ను మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్ నరాల శేఖర్, సీనియర్ నాయకులు నీలం శేఖర్, నరాల దేవేందర్, భాస్కర్ రావు, రాకేష్, నరేష్ పటేల్, కట్ట తిరుపతి, ఆరెపల్లి గ్రామస్తులు ఇటిక్యాల సత్తయ్య, సిలువేణి గోపాల్, దశరతం, శేఖర్, ప్రభాకర్, లింగయ్య, బాపురావు తదితర నాయకులు పాల్గొన్నారు.



## ఉస్మానియా యూనివర్సిటీలో బీసీ దీక్ష ముగింపు..

- బీసీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలి : నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిమ్మానగరం వెంకట్

**బలగం టీవీ, తంగళ్లపల్లి:**

ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజ్ ముందు కొనసాగిన బీసీ దీక్ష గురువారంతో ముగిసింది. ఈ దీక్షకు కొమ్మనవోయినా సైదులు అధ్యక్షత వహించగా, డాక్టర్ జంపాల రాజేష్ ఆధ్వర్యంలో మూడవ రోజుకు చేరుకున్న ఈ కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండేపల్లి గ్రామానికి చెందిన తిమ్మనగరం వెంకట్ నాయి బ్రాహ్మణ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ విద్యార్థి జేఏసీ వైస్ చైర్మన్ గా కొనసాగుతూ ఉస్మానియా యూనివర్సిటీలో బీసీ ఉద్యమానికి మద్దతుగా నిలబడి దీక్ష ప్రారంభించినప్పటి నుండి ఉద్యమానికి వెన్నంటి నిలబడి బీసీల రిజర్వేషన్ల కోసం ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులను మమేకం చేస్తూ ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ, బీసీలకు రిజర్వేషన్లు ఎంత అవసరమో రిజర్వేషన్లలో ఏబీసీడి వర్గీకరణ కూడా అంతే అవసరమని పేర్కొన్నారు. బీసీ వర్గీకరణను తక్షణం అమలు చేయాలని కుల సంఘం తరపున డిమాండ్ చేశారు.ల్ణ ఈ కార్యక్రమంలో ఎంపీ ఆర్. కృష్ణయ్య, గుజ్జ సత్యం, క్రాంతి దళ్ పృథ్వీరాజ్, దాసు సురేష్, తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకులు భూషణ్, బాలు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కూడా హాజరై బీసీ వర్గీకరణకు మద్దతు తెలిపారు.

# త్వరితగతిన సొంతింటి కలను పూర్తి చేసుకోవాలి..

- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, తంగళ్ళపల్లి:**

త్వరితగతిన తమ సొంత ఇంటి కలను పూర్తి చేసుకోవాలని,సొంత ఇంటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తున్నదని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. తంగళ్ళపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో హౌసింగ్ శాఖ నిర్మించిన మోడల్ హౌస్, మండేపల్లి, చింతలపల్లి, రాళ్లపేటలో మొత్తం 11 ఇందిరమ్మ ఇండ్లు పూర్తి కాగా గృహ ప్రవేశాలు గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్, కే కే మహేందర్ రెడ్డి హాజరై ప్రారంభించారు.



ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. లబ్ధిదారులకు నాలుగు విడతల్లో రూ. 5 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నదని అన్నారు.. ఆయా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు అధికారులు అందుబాటులో ఉండి నిర్మాణాలు పూర్తి చేసుకునేలా సహకరించాలని ఆదేశించారు.

**అందుబాటులోకి తీసుకురావాలి..**

తంగళ్ళపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న తహసీల్ కార్యాలయ భవనాన్ని ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే రాళ్ళపేట గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ సందర్శించారు. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు విద్యార్థులకు అందిస్తున్న బోధన, మౌలిక సదుపాయాల తీరుపై ఆమె ఆరా తీశారు. సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూపారెడ్డి, వైస్ చైర్మన్ నర్సింగ్, హౌసింగ్ పీడీ శంకర్, మండల ప్రత్యేక అధికారి, డీపీఓ శర్ఫుద్దీన్, తహసిల్దార్ జయంత్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ శాఖ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి..

- తుది దశలో ఉన్న వాటిని ప్రారంభానికి సిద్ధం చేయాలి..
- ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వివిధ శాఖల పనులపై సమీక్ష సమావేశం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పంచాయతీ రాజ్ (పీఆర్) ఆధ్వర్యంలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో విద్యా శాఖ, పంచాయతీ, అంగన్వాడీ, ఆరోగ్య శాఖ భవనాలు, ఎంపీ ల్యాడ్స్ నిధుల కింద జిల్లాలో మొదలు పెట్టిన పనులపై వివిధ శాఖల, పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడారు. జిల్లాలో 49 అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు మంజూరు కాగా, పలు భవనాలు పూర్తి కాగా, మిగతావి వివిధ దశల్లో ఉన్నాయని ఇంచార్జి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయా పనులను పూర్తి చేసి, పిల్లలను ఆకట్టుకునే రంగులు వేయాలని, నీటి వసతి మిషన్ భగీరథ ద్వారా కల్పించాలని ఆదేశించారు. గ్రామ పంచాయతీ భవనాల పనులను వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. భవిత కేంద్రాల భవనాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, గడువు పెట్టి పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.



జిల్లాలోని 13 కేజీబీవీ ల్లో మంజూరు అయిన అదనపు తరగతి గదులు, మరమ్మత్తు పనులను వెంటనే చేపట్టాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చేయాలని సూచించారు. ఎంపీ ల్యాడ్స్ కింద జిల్లాకు మంజూరు అయిన పనులను వెంటనే మొదలు పెట్టి 15 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. పీ హెచ్ సీ లు, సబ్ సెంటర్ల పనులను పూర్తి చేసి, వైద్య ఆరోగ్య శాఖకు అప్పగించాలని సూచించారు. ఇంకా మొదలు పెట్టని పనులకు వెంటనే టెండర్లు చేయాలని, గడువులోగా పూర్తి చేయించి, ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి, పనులను పూర్తి చేయాలని ఇంచార్జి కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, డీఈఓ వినోద్ కుమార్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, డీఎంహెచ్ఓ డాక్టర్ రజిత, జీ సీ డీ ఓ పద్మజ, డీ పీ ఓ షర్ఫుద్దీన్, డీ డ బ్ల్యూ ఓ లక్ష్మీరాజం తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాల్సిందే..

- బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం..
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు
- జ్యోతిబా ఫూలే విగ్రహం వద్ద మూతికి నల్ల రిబ్బను కట్టుకొని మౌన దీక్ష..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని జ్యోతిబా పూలే విగ్రహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బీసీ శ్రేణులు వినూత్న రీతిలో తమ నిరసనను వ్యక్తం చేశారు. మూతికి నల్ల రిబ్బను కట్టుకొని మౌన దీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం పార్లమెంట్ ఉభయ సభల్లో ఏకగ్రీవ తీర్మానం చేసి, రాజ్యాంగ సవరణ చేసి అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దీనికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చొరవ చూపాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా అన్ని బీసీ సంఘాలను, రాజకీయ పార్టీలను కలిపి అఖిలపక్షంగా ఏర్పాటు చేసి ఢిల్లీకి తీసుకెళ్లాలని పర్శ హన్మాండ్లు కోరారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించుకునే వరకు పోరాడుతూనే ఉంటాం. గల్లి నుంచి రాజధాని వరకు బీసీ ఉద్యమం, బీసీ వాదం బలపడింది. గత నెల 18న నిర్వహించిన బీసీ బంద్ విజయవంతం కావడమే అందుకు నిదర్శనమని హన్మాండ్లు పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్లను సాధించుకొని తీరుతామని, ఎంతవరకైనా తెగిస్తామని, ప్రాణ త్యాగానికైనా సిద్ధమని ఆయన ఉద్ఘాటించారు. బీసీ జేఏసీ తీర్మానం మేరకు అన్ని జిల్లాల్లో ఉద్యమం బలోపేతం అయిందని, రోజువారీ కార్యక్రమాలతో పాటు చివరగా ఢిల్లీలో పార్లమెంట్ మరియు మోదీ ఇంటిని కూడా ముట్టడిస్తామని తెలిపారు. కొన్ని రాజకీయ పార్టీలు రిజర్వేషన్ల అంశంపై ఒకవైపు మద్దతిస్తూనే, మరోవైపు దాటవేస్తున్నాయని, అటువంటి పార్టీల బండారం బయటపెడతామని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్లకు మద్దతు ఇచ్చే పార్టీలకే భవిష్యత్తు ఉంటుందని, వ్యతిరేకించే పార్టీలకు పుట్టగతులు లేకుండా చేస్తామని హెచ్చరించారు. బీసీల ఆత్మగౌరవం, రాజ్యాధికారం కోసం అందరూ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలని పర్శ హన్మాండ్లు పిలుపునిచ్చారు.ఈ మౌన దీక్ష నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకులు తడుక కమలాకర్, బోయిని శ్రీనివాస్, బూర ఆంజనేయులు, చెన్నమనేని రాజకుమార్, దుబాల కొండయ్య, తోట్ల రాములు యాదవ్, కందుకూరి రామాగౌడ్, ఇల్లంతకుంట తిరుపతి, కంచర్ల రాజు, తోట్ల మల్లేశం యాదవ్, కోడం రవి, చిలక శ్రీనివాస్, సామల తిరుపతి, అనిల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# టీమిండియా ఘన విజయం

- నాలుగో టీ20లో ఆస్ట్రేలియాపై 48 పరుగుల తేడాతో విజయం
- సిరీస్‌లో 2-1తో ఆధిక్యం



**బలగం టీవీ, హైదరాబాద్**

భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన ఐదు మ్యాచ్‌ల టీ20 అంతర్జాతీయ సిరీస్‌లో భాగంగా గురువారం గోల్డ్ కోస్ట్‌లో జరిగిన నాల్గవ టీ20 మ్యాచ్‌లో టీమిండియా అద్భుత ప్రదర్శన కనబరిచి ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1 ఆధిక్యాన్ని సాధించింది. చివరి టీ20 ఈనెల 8న జరగనుంది.

టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ ముందుగా బౌలింగ్ ఎంచుకున్నాడు. మొదట బ్యాటింగ్ చేసిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. శుభ్‌మన్ గిల్ (46) టాప్ స్కోరర్‌గా నిలవగా, ఆల్‌రౌండర్లు శివమ్ దూబే (22) మరియు అక్షర్ పటేల్ (21) ముఖ్యమైన పరుగులు సాధించారు.

168 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆసీస్ జట్టు భారత స్పిన్నర్ల ధాటికి తలవంచింది. ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 18.2 ఓవర్లలో కేవలం 119 పరుగులకే ముగిసింది. భారత స్పిన్నర్లు ఈ మ్యాచ్‌లో అద్భుతంగా రాణించారు. వాషింగ్టన్ సుందర్ 3 వికెట్లతో ఆసీస్ పతనాన్ని శాసించగా, అక్షర్ పటేల్ మరియు శివమ్ దూబే చెరో 2, వరుణ్?, అర్షదీప్?, బుమ్రా తలో వికెట్ తీశారు. తన ఆల్ రౌండ్ ప్రదర్శన (బ్యాటింగ్‌లో 21 పరుగులు, బౌలింగ్‌లో 2/20) కనబరిచిన అక్షర్ పటేల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.



# అమ్మకానికి ఆర్సీబీ ఫ్రాంచైజీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌తో పాటు వుమెన్స్ ప్రీమియర్ లీగ్ విజేతలైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫ్రాంచైజీని అమ్మకానికి పెట్టారు. ఆ రెండు ఫ్రాంచైజీలకు యజమాని అయిన డియాజియో కంపెనీ ఈ విక్రయ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించినట్లు తెలిపింది. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు సమర్పించిన నివేదికలో డియాజియో, యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ సంస్థలు ఆర్సీబీ ఫ్రాంచైజీ అమ్మకాల ప్రక్రియను ప్రారంభించినట్లు పేర్కొన్నాయి. 2026 మార్చి 31వ తేదీకి ఈ ప్రక్రియ పూర్తవుతుందని సంస్థలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

**పెట్టుబడుల సమీక్షలో డియాజియో**

డియాజియో ప్రకటనలో, రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో వ్యూహాత్మక పెట్టుబడుల సమీక్ష కొనసాగుతోందని పేర్కొంది. ప్రస్తుతానికి ఆర్సీబీపై యునైటెడ్ స్పిరిట్స్ కంపెనీకి ప్రధాన వాటా ఉంది. సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా రెగ్యులేషన్ 30 ప్రకారం ఈ సమాచారం స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు లేఖ రూపంలో పంపినట్లు సంస్థ వివరించింది.

**కొత్త యజమాని కోసం రేసులో పలు కంపెనీలు**

ఆర్సీబీ ఫ్రాంచైజీని కొనుగోలు చేయడానికి దేశంలోని ప్రముఖ సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. వాటిలో అదానీ గ్రూప్, జీఎస్‌డబ్ల్యూ జిందాల్ గ్రూప్, ఆదార్ పూనావాలా ఆధ్వర్యంలోని సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, అలాగే ఢిల్లీలోని రవి జైపురియాకు చెందిన దేవయాని ఇంటర్నేషనల్ గ్రూప్ కూడా పోటీదారులుగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది.

# డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్‌కి భారీ రీటైన్



**బలగం టీవీ, హైదరాబాద్**

మహిళల ప్రీమియర్ లీగ్ నాలుగో సీజన్ కోసం ఫ్రాంచైజీలు భారత క్రికెటర్లను భారీ ధరలకు రీటైన్ చేసుకున్నాయి. వరల్డ్‌కప్ విజేత టీమిండియా సభ్యులైన స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, రీచా ఘోష్‌ల విలువ గణనీయంగా పెరిగింది. భారత్ తరపున అద్భుతంగా రాణించిన స్మృతి మంధానను ఆర్సీబీ రూ.3.50 కోట్ల రికార్డు ధరకు రీటైన్ చేసుకుంది. మరోవైపు వరల్డ్‌కప్ ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ దీప్తి శర్మను యూపీ వారియర్స్ విడిచిపెట్టడం అభిమానుల్లో ఆశ్చర్యం రేపుతోంది.

**ముంబై ఇండియన్స్ రికార్డు ఆఫర్**

రెండుసార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌ను రూ.2.5 కోట్లకు కొనసాగించినా, ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ నాట్ సీవర్ బ్రంట్‌కు రూ.3.5 కోట్ల భారీ మొత్తం చెల్లించింది. అలానే హేలీ మాథ్యూస్ (రూ.1.7 కోట్లు), అమన్‌జోత్ కౌర్ (రూ.1 కోటి), లిలిజి. కమలిని (రూ.50 లక్షలు)లిలిను కూడా రీటైన్ చేసింది.ప్రస్తుతం ముంబై పర్స్‌లో రూ.5.75 కోట్లు మిగిలి ఉన్నాయి.

**ఢిల్లీ క్యాపిటల్స్ సంతకం చేసిన స్టార్‌లు**

ఢిల్లీ క్యాపిటల్స్ వరల్డ్‌కప్ సెమీ ఫైనల్ హీరోయిన్స్ జెమీమా రోడ్రిగ్స్, షఫాలీ వర్మలను రూ.2.2 కోట్ల చొప్పున కొనసాగించింది.

అలాగే మరిజానే కాప్, అనాబెల్ సథర్‌లాండ్, నిక్కీ ప్రసాద్‌లను సైతం అట్టిపెట్టుకుంది.ఢిల్లీ పర్స్‌లో రూ.6.75 కోట్లు ఉన్నాయి.

**ఆర్సీబీ రికార్డు బిడ్డు**

రెండో సీజన్ ఛాంపియన్ ఆర్సీబీ, స్టార్ ప్లేయర్లను కొనసాగించింది. స్మృతి మంధానకు రూ.3.5 కోట్లు, రీచా ఘోష్‌కు రూ.2.75 కోట్లు, ఎలీసా పెర్రీకి రూ.2 కోట్లు,అలాగే ఆల్‌రౌండర్ శ్రేయాంక పాటిల్‌కు రూ.60 లక్షలు ఇచ్చింది. పర్స్‌లో రూ.6.15 కోట్లు మిగిలి ఉన్నాయి.

**యూపీ వారియర్స్ షాకింగ్ నిర్ణయం**

గత మూడు సీజన్లలో ప్లే ఆఫ్స్ చేరలేకపోయిన యూపీ వారియర్స్, కేవలం లిలిశ్వేతా షెరావత్ (రూ.50 లక్షలు)లిలిను మాత్రమే రీటైన్ చేసింది. దీప్తి శర్మ, అలీసా హేలీ, క్రాంతి గౌడ్, సోఫీ ఎకిల్‌స్టోన్, గ్రేస్ హ్యారీస్‌లను వదిలేసింది. పర్స్‌లో రూ.14.5 కోట్లు ఉన్నాయి.

**గుజరాత్ జెయింట్స్ తక్కువ ప్లేయర్లు**

గుజరాత్ జెయింట్స్, అష్ గార్డ్‌నర్ (రూ.3.5 కోట్లు), లిలిబేత్ మూనీ (రూ.2.5 కోట్లు)లిలిలను మాత్రమే అట్టిపెట్టుకుంది. గత వరల్డ్‌కప్‌లో అత్యధిక పరుగులు చేసిన లారా వొల్వార్ట్‌ను వదిలేయడం ఆశ్చర్యం కలిగించింది. పర్స్‌లో రూ.9 కోట్లు మిగిలి ఉన్నాయి.

**మెగా వేలం నవంబర్ 27న**

డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ మెగా వేలం నవంబర్ 27న జరగనుంది. ఎవరెవరు కొత్త ఫ్రాంచైజీలకు వెళ్తారు, ఎవరు మళ్లీ తమ జట్టులోనే కొనసాగుతారు అనే ఆసక్తి అభిమానుల్లో ఊపిరి బిగపట్టిస్తోంది.



# భారత మహిళల జట్టును అభినందించిన రాష్ట్రపతి

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐసీసీ వన్డే ప్రపంచకప్ విజేతగా నిలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు గురువారం రాష్ట్రపతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా చారిత్రక విజయాన్ని సాధించిన టీమిండియాను రాష్ట్రపతి అభినందిస్తూ, "మహిళలు చరిత్ర సృష్టించారు, యువతకు స్ఫూర్తిగా నిలిచారు" అని ప్రశంసించారు. గత బుధవారం టీమిండియా ప్రధాని నివాసంలో ప్రధాని నరేంద్ర మోదీని కూడా కలిసిన విషయం తెలిసిందే. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని భారత మహిళల జట్టు ఫైనల్‌లో దక్షిణాఫ్రికాపై 52 పరుగుల తేడాతో విజయం సాధించి టైటిల్‌ను కైవసం చేసుకుంది.

ఈ సందర్భంగా భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, భారత జట్టు తరపున ప్రెసిడెంట్ ముర్ముకు జాతీయ జెర్సీని అందజేశారు. ఈ క్షణం తమకు ఎంతో గౌరవంగా ఉందని ఆమె పేర్కొన్నారు. "ఈ వరల్డ్‌కప్ మా జీవితంలోని ప్రత్యేక ఘట్టం. భారత్‌లో టోర్నీ జరుగుతుందని తెలిసినప్పటి నుంచే ఈ ట్రోఫీని దేశం కోసం గెలవాలని మా లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈ రోజు ఆ కల సాకారమైంది," అని హర్మన్‌ప్రీత్ కౌర్ అన్నారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి జట్టు సభ్యులు, కోచ్‌లు, బీసీసీఐ అధికారులు హాజరయ్యారు.

## పాన్ షాప్, లాడ్జీలలో నార్కోటిక్ జాగిలాలతో ఆకస్మిక తనిఖీలు..

- గంజాయి రవాణా చేసిన, అమ్మిన, సేవించిన కఠిన చర్యలు తప్పవు :

**టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నటేష్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణ పరిధిలోని పాన్ షాపులు, లాడ్జీలలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నార్కోటిక్ జాగిలాలతో ఆకస్మిక విస్తృత తనిఖీలు నిర్వహించినట్లు టాస్కోఫ్ఫర్స్ ఇన్స్పెక్టర్ నటేష్ తెలిపారు ఈ సందర్భంగా సి.ఐ మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి లాంటి పదార్థాల నిర్మూలానే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని, టాస్కోఫ్ఫర్స్ సిబ్బంది మత్తు పదార్థాలను గుర్తించే నార్కోటిక్ జాగిలలతో తరచు జిల్లా పరిధిలో ఉన్న లాడ్జిలలో, పాన్ షాప్, కిరాణా షాప్ లలో, బస్టాండ్ ప్రాంతాల్లో, రద్దీగాల ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో విన్నూత కార్యక్రమాల ద్వారా ప్రజలకి మత్తు పదార్థాల వల్ల కలుగు అనార్ధాల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారుజిల్లాలో గంజాయి రవాణా చేసిన,అమ్మిన,సేవించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధించిన గంజాయి లాంటి మత్తు పదార్థాల సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్ లో సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# రెండో అనధికారిక టెస్టులో పుంజుకున్న భారత 'ఏ' జట్టు



**బలగం టీవీ, హైదరాబాద్**

రెండో అనధికారిక టెస్టులో భారత 'ఏ' జట్టు పుంజుకుంది. టాపార్డర్ విఫలమైనా.. ధ్రువ్ జురెల్(132 నాటౌట్) సూపర్ సెంచరీతో టీమిండియాను ఆదుకున్నాడు. సఫారీ పేసర్ టియాన్ వాన్ వురేన్ (4-54) ధాటికి ప్రధాన ఆటగాళ్లను ఔట్ చేసి ఒత్తిడిలో పడేశాడు. కేఎల్ రాహుల్(19), కెప్టెన్ రిషభ్ పంత్(24)లు నిరాశపరచగా.. జట్టును గట్టెక్కించే బాధ్యతను భుజాన వేసుకున్న జురెల్ గొప్ప ఇన్నింగ్స్ ఆడాడు. అయితే ప్రసిధ్ కృష్ణ(0)ను ఔట్ చేసిన వురేన్ 255 వద్ద భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు. దాంతో.. త ఆట ముగిసే సరికి ఆలౌట్ ప్రమాదంలో పడిన జట్టును కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన జురెల్ జట్టును ఆలౌటయ్యింది.

దక్షిణాఫ్రికా టెస్టు సిరీస్ సన్నాహక మ్యాచ్‌లో భారత స్టార్లు నిరాశపరిచారు. భారత ఏ జట్టు తరపున ఆడుతున్న కేఎల్ రాహుల్(19), కెప్టెన్ రిషభ్ పంత్(24)లు సఫారీ ఏ బౌలర్లను ఎదుర్కోలేక స్వల్ప స్కోర్‌కే వెనుదిరిగారు. తొలి సెషన్ ఆరంభంలోనే ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్(0)ను ఔట్ చేసి బ్రేకిచ్చాడు మొరెకీ. ఆ తర్వాత రాహుల్‌ను వురేన్ బోల్తా కొట్టించగా.. కుదరుకున్న సాయి సుదర్శన్‌ను సుబ్రయేణ్ ఎల్బీగా వెనక్కి పంపాడు. 41కే మూడు వికెట్లు పడిన వేళ క్రీజులోకి వచ్చిన పంత్ దూకుడుగా ఆడే క్రమంలో మొరెకి ఓవర్లో ఔటయ్యాడు.

సఫారీ బౌలర్ల జోరుతో రెండో సెషన్‌లోనే కుప్పకూలేలా కనిపించిన టీమిండియాను ధ్రువ్ జురెల్ (132 నాటౌట్) ఆదుకున్నాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా క్రీజులో పాతుకుపోయిన అతడు సఫారీలను విసిగిస్తూ కుల్దీప్ యాదవ్(20), సిరాజ్(15)తో కీలక రన్స్ జోడించాడు. 89కే ఐదు వికెట్లు పడిన వేళ.. టెయిలెండర్లతో కలిసి స్కోర్ రెండొందలు దాటించాడు. సెంచరీ తర్వాత దూకుడుగా ఆడిన జురెల్ జట్టుకు భారీ స్కోర్ అందించాలుకున్నాడు. అయితే.. కుల్దీప్ రనౌట్ కావడం.. సిరాజ్‌ను సెలే వెనక్కి పంపాడు. చివరి వికెట్ అయిన ప్రసిధ్ కృష్ణను ఔట్ చేసిన వురేన్ భారత ఇన్నింగ్స్‌కు తెరదించాడు.